రాంగ్ రూట్ ప్రయాణానికి చెక్!

- గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా కృషి
- ప్రత్యామ్నాయ రహదారుల్లో వెళ్లాలని సూచన



ఫుట్‌పాత్ ఆక్రమణతో రోడ్డుపై నుంచి నడిచి వెళ్తున్న విద్యార్థులు



బంక్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహన చోదకులను అడ్డుకుంటున్న ట్రాఫిక్ పోలీస్

గోపాలపట్నం: కొంచెం దూరం తగ్గుతుందనే ఆలోచనతో చేస్తున్న రాంగ్ రూట్ ప్రయాణానికి ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. గోపాలపట్నం బంక్ సెంటర్ నుంచి కొత్తపాలెం వైపు వెళ్లే రాంగ్ రూట్ ప్రయాణాన్ని గోపాలపట్నం పోలీసులు నిలిపివేశారు. ఈ దారిలో వెళ్లవద్దని వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో వెళ్లాలని సూచిస్తున్నారు. బుధవారం బంక్ సెంటర్ నుంచి హైస్కూల్ పక్కన ఉన్న రహదారిలో ప్రయాణానికి నిరాకరించారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కాపలా ఉండి అందరికీ అవగాహన కల్పిస్తూ రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహన చోదకులను అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామని చెబుతున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణతో బెడద

బంక్ జంక్షన్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డును ఆక్రమించి ఉన్న దుకాణాలు, తోపుడు బళ్ల వల్ల ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఫుట్‌పాత్ పైనుంచి పాదచారులు, విద్యార్థులు వెళ్లే విధంగానైనా అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ప్రమాదాలు నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు మంచివేనని, పాదచారులు రోడ్డు పైనుంచి వెళ్లడాన్ని కూడా నిరోధించాలని కోరుతున్నారు. ట్రాఫిక్ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఈ సారీ మూణ్నాళ్ల ముచ్చటేనా!

రాంగ్ రూట్‌లో వెళ్లడానికి అడ్డుకున్నా ఇది ఎన్నాళ్లు కొనసాగదని, ఒకటి రెండు రోజుల షోగా మారిపోతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఈ రాంగ్ రూట్ ప్రయాణాన్ని ఆపేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడి వుడా లేఅవుట్ కాలనీ లోపలి నుంచి గోడ తొలగించి ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేశారు. అయితే కాలనీ వాసులు అడ్డుకోవడం పరిస్థితి మొదటికి వచ్చింది. బంక్ నుంచి కొత్తపాలెం వెళ్లాలంటే వాహన చోదకులకు ఇబ్బంకరంగా మారింది. ఆటోలు, కార్లు మాత్రం శ్మశానవాటిక జంక్షన్ నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు సరైన ప్రత్యామ్నాయం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్ పరిశీలన
- 92, 89 వార్డుల్లో ఎమ్మెల్యేతో కలిసి పర్యటన



కొత్తపాలెం ఎర్ర చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు పరిశీలిస్తామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. 92, 89 వార్డుల్లో బుధవారం ఎమ్మెల్యే గణబాబుతో కలసి ఆయన పర్యటించారు. గోపాలపట్నం హైస్కూల్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ క్రీడా ప్రాంగణంలో లైటింగ్‌తో కూడిన వాకింగ్ ట్రాక్, స్కేటింగ్ రింగ్, 100 మీటర్ల మైదానం వంటి పలు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. ఈ పాఠశాల చాలా పురాతనమైనదని, ఎంతో మంది విద్యావేత్తలను, జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిందని కమిషనర్‌కు వివరించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎర్ర చెరువును శుభ్రం చేయండి

89వ వార్డు కొత్తపాలెం ఎర్ర చెరువు ప్రాంతాన్ని కమిషనర్, ఎమ్మెల్యే సందర్శించారు. ఈ చెరువులో పూడికలు తొలగించి, శుభ్రం చేయాలన్నారు. ఎర్ర చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. చెరువు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జీవీఎంసీ కమిషనర్ హామీ ఇచ్చారు. పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి ఇ.సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష‌కుమార్, జోనల్ కమిషనర్ హేమావతి, పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, రామ్ మోహనరావు, కార్యనిర్వాహక ఇంజినీర్లు రత్నాకర్, ఏడు కొండలు, ఏడీహెచ్ సురేష్, రఘునాథరావు, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి

కంచరపాలెం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం కంచరపాలెం రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి జి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, పందిరి కూరగాయల సాగు, మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మన ప్రాంగణం.. మన బాధ్యత



గోపాలపట్నం రైతు బజారులో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

గోపాలపట్నం: మన ప్రాంగణం... మన బాధ్యత అనే నినాదంతో రైతు బజారులో బుధవారం స్వచ్ఛతా సేవా కార్యక్రమం నిర్వహించారు. గోపాలపట్నం రైతు బజారులో రైతులు, వర్తకులు, అధికారులు సంయుక్తంగా ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. మన ప్రాంగణాన్ని మనమే శుభ్రం చేసుకోవాలని ఇది అందరూ బాధ్యతగా స్వీకరించాలన్న సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో రైతు బజారు ఈవో నారాయణరావు, సహాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుసర్ల కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, సీతారామరాజు నగర్, బాజీజంక్షన్, రెడ్డి వీధి, ఎస్సీకాలనీ, విద్యానగర్, నాయుడుక్వార్టర్స్, రైల్వే స్టేషన్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



బొనుగు శౌర్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బొనుగు శౌర్య అనే వృద్ధుడు జ్ఞానాపురంలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. గత నెల 29న ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి చేరుకోలేదు. అంతటా వెతికినా ఆచూకీ తెలియరాలేదు. ఈ వృద్ధుడుకి మతిమరపు ఉందని, ఆరోగ్యం కూడా బాగులేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వృద్ధుడి భార్య ఆంథోనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ప్రజాప్రతినిధులకు వినతులు



పోరాట కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న కమిటీ చైర్మన్ నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు సెయిల్‌లో విలీనం, ముడి పదార్థాల లభ్యత తదితర అంశాలపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులను కలవనున్నారు. అంబేడ్కర్ కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సాధ్యమైనంత త్వరలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో విశాఖ ఎంపీ భరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లను కలిసి సమస్యలను వివరించనున్నారు. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా కలవాలని నిర్ణయించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి బి. శ్రీనివాసవర్మ, విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబులను కలవనున్నారు. ఈ సందర్భంగా హైకోర్టులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వేసిన కేసు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు సీహెచ్. నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎస్.రావు, యు.రామస్వామి, వై.టి.దాస్, వై.మస్తానప్ప, బి.డేవిడ్, పరంధామయ్య, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా పదవీ విరమణ సత్కారం



విజయకుమారిని సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: మల్కాపురం మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన ఏఎన్ఎం వి.విజయకుమారిని బుధవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆమెకు శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ వ్యక్తికైనా వృత్తిపరంగా పదవీ విరమణ ఉంటుంది గానీ.. సేవ చేసేందుకు ఎటువంటి రిటైర్‌మెంట్ ఉండదన్నారు. విజయకుమారి ఒక ఉద్యోగిగానే కాకుండా ప్రజాసేవే పరమావధిగా విధులు నిర్వహించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆమె శేషజీవితాన్ని ఆత్మీయుల మధ్య సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు

సింథియా: షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు బుధవారం గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. కొంతకాలం నుంచి కష్టపడి పని చేస్తూ ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్న షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. షిప్‌యార్డ్ కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి సీజ్



రైల్వే పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వేపోలీసులు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో బుధవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది సంయుక్తంగా పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. రాజస్తాన్‌కు చెందిన పరమేశ్వర్‌జాట్, కమలేష్ వైష్ణవ్‌లను, వేరొక కేసులో ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన రామేశ్వర్‌నాయక్, ప్రతాప్‌నాయక్‌లను తనిఖీలు చేయగా వీరు చెన్నైకు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.55 లక్షల విలువైన సుమారు 51 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని వ్యక్తి ఆత్మహత్య

ఆరిలోవ: తన భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి ఎండాడ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రామాలయం వీధిలో ప్రగడ సతీష్(39), భార్య దేవి, ముగ్గురు పిల్లలతో నివాసముంటున్నారు. సతీష్ గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో దేవి అదే గ్రామంలో ఉన్న కన్నవారి ఇంటికి పిల్లల్ని తీసుకుని వెళ్లిపోయింది. సతీష్ తన భార్యకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు సున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగు పొరుగు వారు బుధవారం ఉదయం చూసి దేవికి సమాచారం అందించారు. ఆమె వచ్చిన అనంతరం స్థానికులు, బంధువులు కలసి ఇంటి తలుపులు తెరిచారు. అనంతరం ఆమె ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కంటి శస్త్రచికిత్సల్లో శంకర్ ఫౌండేషన్ ప్రగతి

డీజీఎం బంగార్రాజు వెల్లడి



బంగార్రాజు



శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అత్యధిక శస్త్రచికిత్సలు చేసి ప్రజల కళ్లల్లో వెలుగులు నింపిందని ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్యలు అందిస్తున్న నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గడిచిన ఏప్రిల్ నుంచి జూన్ వరకు 8,839 కంటి శస్త్రచికిత్సలు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే 50,555 మంది ఔట్ పేషెంట్లకు సేవలందించడం జరిగిందన్నారు. రెటీనా, రెటీనా ఇంజెక్షన్లు, గ్లకోమా, కార్నియా, పీడియాట్రిక్ కంటి వైద్యం, ఆర్బిట్ అక్యూలో ప్లాస్టీ విభాగాల్లో మంచి ప్రగతి సాధించిందన్నారు. సామాజిక కంటి వైద్య సేవల్లో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 130 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు 3,265మందికి కంటి శస్త్రచికిత్సలు చేసి వారి గమ్యస్థానాలకు ఉచితంగా చేరవేయడం జరిగిందన్నారు. అద్భుతంగా సేవలందించిన వైద్యులు, సిబ్బందిని శంకర్ ఫౌండేషన్ ట్రస్టీస్ ఆత్మకూరు కృష్ణకుమార్, ఆత్మకూరు విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందించారు.

సుప్రసిద్ధ రచయిత బలివాడ



మాట్లాడుతున్న రచయిత వేణు

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో వైవిధ్యభరితమైన కవితలు చదివి అందరినీ అలరించారు. రచయిత బలివాడ కాంతారావు జయంతి సందర్భంగా డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ తెలుగు నవల, కథా సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించుకున్న సుప్రసిద్ధ రచయిత బలివాడ కాంతారావు అని పేర్కొన్నారు. బాల్యంలోనే స్కూల్ మ్యాగజైన్‌కు సంపాదకుడిగా పనిచేసిన ఘనత ఆయనదని తెలిపారు. బలివాడ 38 నవలలు, 400 వరకు కథలు, 5 నాటికలు, మరెన్నో రేడియో నాటికలు రాశారన్నారు. నిజాయితీ, నిక్కచ్చితనం, జాలి, దయ, కరుణ ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపించేవని చెప్పారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు వారు గర్వించదగ్గ రచయిత బలివాడ కాంతారావు అని కొనియాడారు. రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.సిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, పి.వి.ఆర్.కుమార్, పరమేశ్వరరావు, బి.రాధారాణి, సురేష్ తదితరులు కవితలు చదివి వినిపించారు.

డాక్టర్ ప్రసాద్‌కు సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ ప్రసాద్ మారెళ్ల

సీతంపేట: డాక్టర్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన వరల్డ్ కాన్ఫరెన్స్‌లో నగరానికి చెందిన డాక్టర్ ప్రసాద్ మారెళ్ల నేషనల్ సిగ్నిఫికెంట్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేశ విదేశాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు పాల్గొన్నారు. ఇండియాతో పాటు దుబాయ్, ఇటలీ, సింగపూర్ వంటి దేశాల నుంచి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఆర్థో, కార్డియో, న్యూరో, స్పోర్ట్స్ రిహాబిలిటేషన్ తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించారు. అపోలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హన్నా రాజశేఖర్, పీఎఫ్ఐ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.ప్రసాద్ చేతుల మీదుగా డాక్టర్ ప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, కరోనా సమయంలో అందించిన వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఆధ్యాత్మిక వైభవం

జగన్నాథ స్వామి రథోత్సవాలు అంగరంగ వైభవంగా నేడు ప్రారంభం కానున్నాయి. టౌన్ కొత్త రోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి వారి రథయాత్రకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. స్వామి వారి రథోత్సవంలో భాగంగా రోజుకొక అవతారంలో స్వామి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ రూపాలను వీక్షించి భక్తులు తరించిపోతారు.

- నేటి నుంచి జగన్నాథుని రథోత్సవాలు
- ప్రతిష్ఠా ప్రారంభ సంకల్పం నేడు
- 5వ తేదీ రాత్రి విశేష హోమాలు
- 6న పూర్ణాహుతి, నేత్రోత్సవం, సుభద్రాదేవి శాంతి కల్యాణం
- 7న తొలి రథయాత్ర
- 8 నుంచి స్వామి దశావతారాలు
- 18న తిరుగు రథయాత్ర



జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామి

డాబాగార్డెన్స్: టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 4 నుంచి 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4 గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్ఠాపన సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచ శయ్యాదివాసాలు, 6న ఆషాడ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7 ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

స్వామి అవతారాలు..

8న మత్స్యావతారం, 9న కూర్మావతారం, 10న వరాహావతారం, 11,12న నృసింహావతారం, 13న వామనావతారం, 14న పరశురామావతారం, 15న శ్రీరామావతారం, 16న బలరామ.. శ్రీకృష్ణావతారం, 17న తొలి ఏకాదశి, శేష పాన్పు అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తిరుగు రథయాత్ర..

18 ఉదయం 9.15 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళ వాయిద్యాల నడుమ జగన్నాథుని నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో అత్యంత వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. 19 ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేస్తారు.



రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం

నిత్య పూజలు..

జూలై 8 నుంచి 17 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజలు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథ స్వామి ప్రార్థనా గాన సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్ర నామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనాలనుకునే భక్తులు దేవస్థానం కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్ర నామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయాలనుకునే భక్తులు ముందుగా ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.

నాగుపాము కలకలం



డాల్ఫిన్‌నోస్ నేవల్ గృహాల వద్ద పట్టుకున్న నాగుపాముతో స్నేక్ క్యాచర్ నాగరాజు

సింథియా: డాల్ఫిన్‌నోస్ నేవల్ ఏరియాలోని నేవీ సిబ్బంది గృహ సముదాయాల వద్ద 9 అడుగుల నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని రోడ్డుపై తిరుగుతూ గోడ రంధ్రంలో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి పాములు పట్టే నేర్పరి నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్యమైన ప్రదేశంలో విడిచిపెట్టాడు. విషసర్పం కావడంతో ఎవరికి ఏ ప్రమాదం జరగకపోవడం అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచూ పాముల సంచారం కనిపిస్తోందని, వర్షా కాలంలో మరింత అధికంగా ఉంటుందని, తగు నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.